వైఎస్సార్ కాంగ్రెస్‌ది చేతల ప్రభుత్వం


చింతలపూడి మెరకవీధిలో మహిళకు బ్రోచర్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా


కొయ్యలగూడెంలో ఓ వృద్ధురాలికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం : తమది మాటల ప్రభుత్వం కాదు అని చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం కొయ్యలగూడెంలో పార్టీ పట్టణ కన్వీనర్ సంకు కొండ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ నగర్, తాడేపల్లిగూడెం రోడ్డు ప్రాంతాలలో ఎమ్మెల్యే బాలరాజు గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీలను నూరుశాతం నెరవేర్చారని, దీంతో ప్రజల వద్దకు వెళుతున్న తమకు సాదర స్వాగతం లభిస్తోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలన్నదే తమ తపన అని ఆడపడుచులు పేర్కొంటూ ఉండడం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని కలిగిస్తోందన్నారు. ఊసరవెల్లి రాజకీయాలు చేసే నారా చంద్రబాబు నాయుడుని గాని, నిలకడ లేని రాజకీయాలకు నిదర్శనంగా ఉన్న పవన్ కళ్యాణ్‌ను గాని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేఆర్‌ఎస్ కృష్ణ ప్రసాద్, ఎంపీపీ గంజిమాల రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, పార్టీ నాయకులు నిక్కర్ నాగేశ్వరరావు, మారిశెట్టి శ్రీను, చిటికెన నాగార్జున కొనకళ్ళ రాము, ప్రభుదాసు, కొల్లూరు యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ లబ్ధి

చింతలపూడి : నాలుగేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సంక్షేమ పథకాల అమలుతో పేద ప్రజల ఆర్థిక స్థితిగతులను మార్చారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నగర పంచాయతీ పరిధిలోని మెరకవీధి, రత్నా విలేజ్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను స్వయంగా వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. నాలుగేళ్ల పాలనలో ఏఏ పథకం కింద ఎంత లబ్ధి పొందారో తెలియజేస్తూ లబ్ధిదారులకు కరపత్రాలను అందజేశారు. అర్హత ఉండి పథకాలు అందని వారు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డ్రెయిన్లు, రహదారులు నిర్మించాలని, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ తల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మిరియాల దిలీప్, మండల యూత్ కన్వీనర్ వెంపా కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ ఎం.ఇమ్మానియేలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ కాంతారావు, గఫూర్, జంగా చెన్నకేశవరెడ్డి, యడ్ల మోహన్‌రావు, బొల్లం వెంకటలక్ష్మి, గోల్కొండ సురేష్, బోడ బాలు, అధికారులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


చింతలపూడి మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

చింతలపూడి : ముస్లింల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. బుధవారం స్థానిక జామియ మసీదులో రంజాన్ ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు ఎమ్మెల్యే ఎలీజా ఇఫ్తార్ విందు ఇచ్చారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించబట్టే విద్య, ఉద్యోగాల్లో అనేక మంది ముస్లిం యువకులు లబ్ధి పొందారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూడా ముస్లింలంటే ప్రత్యేక అభిమానమన్నారు. బడ్జెట్‌లో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నారని తెలిపారు. రంజాన్ పండుగను ప్రతి ముస్లిం సోదరుడు సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన అభిలషించారు. అనంతరం ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా ఖబరస్థాన్ (శ్మశాన వాటిక)కు బోరు మంజూరు చేయాలని, షాదీఖానాలో వంట షెడ్డు, డైనింగ్ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఖబరస్థాన్‌లో బోరు వేయడానికి అప్పటికప్పుడే నిధులు కేటాయిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. కార్యక్రమంలో అంజుమన్ మహఫిజుల్ ఇస్లాం కమిటీ అధ్యక్షులు సయ్యద్ రహీం(బాబు) కార్యదర్శి ఎండీ జిలాని, జమా అతె ఇస్లాం హింద్ పట్టణ కన్వీనర్ ఎండీ అక్బర్‌ఆలి, ఎస్కే ఆజాద్, ఎస్‌డీ ఖాజా మొహిద్దీన్, ఎండీ హాజీ, సయ్యద్ ఖలీల్, ఇమ్రాన్, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో ఇఫ్తార్ విందు


ధర్మాజీగూడెం మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు సందీప్, వరప్రసాద్

లింగపాలెం : రంజాన్ పర్వదినం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు ధర్మాజీగూడెం మసీదులో బుధవారం వైఎస్సార్ సీపీ నేత సొంగా సందీప్ ఖర్జూరాలు, ఫ్రూట్స్ అందజేశారు. ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత ఎదురుపాక నాగేశ్వరరావు నివాసంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు అందించారు. అనంతరం మసీదులో ముస్లీం మతపెద్దలతో సామూహిక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు, పార్టీ నాయకులు కోటగిరి హరీష్, కోటగిరి ధీరాజ్ కృష్ణ, నూతలపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువతను సమాజ సేవలో భాగస్వామ్యం చేయాలి

కొయ్యలగూడెం : యువత సమాజ హిత కార్యక్రమాల్లో స్వచ్ఛంద భాగస్వాములయ్యేలా యూత్ క్లబ్‌లు దోహదం చేస్తాయని ఎంపీడీవో కేఆర్‌ఎస్ కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువత అసాంఘిక కార్యక్రమాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా వారిని సమాజ సేవలో భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వీటిని ఏర్పాటు చేసి యువతను స్వచ్ఛంద భాగస్వాములు చేసేలా వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. గ్రామ లేదా వార్డు సచివాలయం పరిధిలో 18 నుంచి 35 ఏళ్ల వయసు గల యువకులు 10 నుంచి 15 మంది సభ్యులను ఒక క్లబ్‌గా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నెహ్రూ యువకేంద్ర, ఎన్‌ఎస్‌ఎస్, విద్య, పోలీస్, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం శాఖల పర్యవేక్షణలో యూత్ క్లబ్‌లతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మత్తు పదార్థాల నిరోధం, ఈవ్ టీజింగ్, దిశా యాప్ వంటి వాటిపై యూత్ క్లబ్‌ల ద్వారా కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. దీని వల్ల యువత సరైన దిశలో పయనించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సెట్‌వెల్ యూత్ క్లబ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి మార్గనిర్దేశనం చేస్తుందన్నారు.

26లోగా మిషన్ వాత్సల్యకు దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్

జంగారెడ్డిగూడెం : అనాధలు, పాక్షిక అనాధ పిల్లలకు మిషన్ వాత్సల ద్వారా అందిస్తున్న స్పాన్సర్‌షిప్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులలో విధులు నిర్వహించే సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టపరిధిలో వారికి అందిచాల్సిన రక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న కార్యక్రమాలపై, బాలల హక్కుల చట్టాలపై, ప్రభుత్వం 18 ఏళ్లలోపు బాలబాలికలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై సమావేశంలో వివరించారు. అలాగే మిషన్ వాత్సల్య ద్వారా అనాధలు, పాక్షిక అనాధలకు స్పాన్సర్ షిప్ కార్యక్రమం ద్వారా కలిగే ప్రయోజనాలను కూడా తెలియజేశారు. సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి, వారికి పథకం గురించి వివరించాలన్నారు. ఈ పథకానికి ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.కిరణ్ కుమార్, సీడీపీవో కె.స్వర్ణకుమారి, పి.బ్యూలా, కె.వెంకాయమ్మ, సూపర్‌వైజర్లు, ఎం.మంగతాయారు, కె.లక్ష్మి, విజయలక్ష్మి, సెక్టార్ల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

21న వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం : వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై ఎం.సాగర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈబీ డీఎస్పీ, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో జప్తు చేయబడిన మోటార్ సైకిళ్లను వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని, వివరాలకు ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పథకాల అమలు తీరు పరిశీలన


సచివాలయంలో ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలిస్తున్న అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్

బుట్టాయగూడెం : అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ బుధవారం బుట్టాయగూడెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నందాపురం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై డాక్టర్ సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఆస్పత్రి సమీపంలోని ఆర్అండ్ఆర్ కాలనీని సందర్శించి కాలనీ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నూతిరామన్నపాలెంలోని గ్రామ సచివాలయాన్ని సందర్శించి సచివాలయం ద్వారా అమలు చేస్తున్న పథకాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా భవనం వద్ద డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేయూత, ఆసరా, అమ్మ ఒడి వంటి పథకాల సొమ్ములను నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నారని మహిళలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పీవీఎస్ నాయుడు, వెలుగు ఏపీడీ మడివి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన గుండుబోయిన సాయి అచ్యుత్ వ్యక్తి పనుల నిమిత్తం ఈ నెల 3న జంగారెడ్డిగూడెం వచ్చాడు. ఈ క్రమంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కేటీఎం 200 డ్యూక్ మోటార్ సైకిల్‌ను పార్క్ చేసి, టీ తాగి వచ్చి చూడగా కనిపించలేదు. అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటార్‌సైకిల్ విలువ సుమారు రూ. 1.50లక్షలు ఉంటుందని అచ్యుత్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై చెప్పారు.

ఇంటింటికీ జగనన్నే మా భవిష్యత్


కేతవరంలో ప్రజాభిప్రాయాన్ని నమోదు చేస్తున్న దృశ్యం


మారేదుబాకలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కోరారు. మండల కేంద్రమైన బుట్టాయగూడెంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం చేశారు. అలాగే ప్రతి ఇంటికీ జగనన్నే మా నమ్మకం స్టిక్కర్‌లను అతికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచిని ప్రతిపక్షాలు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. టీడీపీ కుట్రలను తిప్పికొట్టి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించేందుకు ప్రజలు సంపూర్ణమైన మద్దతు పలకాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ తెల్లం సింహాచలం, సచివాలయ కన్వీనర్‌లు గాడి వెంకటరెడ్డి, తోట త్రిమూర్తులు, భాస్కరరావు, నాయకులు కోరం దుర్గారావు, కొదం కడియ, నిట్టా చిట్టిబాబు, తెల్లం దేవరాజు, లాలూ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో మా నమ్మకం నువ్వే జగన్

బుట్టాయగూడెం : జీలుగుమిల్లిలో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మంచిని వివరించారు. అదేవిధంగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లను ఇంటి తలుపులకు అతికించారు. సచివాలయ కన్వీనర్‌లు గంగుల రమేష్, రామకృష్ణ, శీలం వెంకన్న, నాయకులు కొప్పుల సత్యనారాయణ, కక్కిరాల చక్రి, చిట్టిబొమ్మ శ్రీను, యాండ్ర రవిబాబు, కుమ్మర టోని పాల్గొన్నారు.

కుకునూరు : మారేదుబాక సచివాలయ పరిధిలో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన సచివాలయ కన్వీనర్, గృహసారథులకు ప్రజలు సాదర స్వాగతం పలికారు. తమకు అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రజలంతా ఎంతో సంతోషం వ్యక్తం చేశారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు తెలియజేశారని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. .

ప్రజా సంక్షేమమే ధ్యేయం

టి నరసాపురం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని కేతవరం సర్పంచ్ తడికలపూడి శివ మాధవి తెలిపారు. కేతవరం గ్రామ పంచాయతీలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌లను ఇంటి గోడలకు, తలుపులకు అంటించారు. ఎంపీటీసీ బొడ్డపాటి రాంబాబు, జంగం ఇస్సాకు, రాచప్రోలు రమేష్, జంగం బాబురావు, గంటా మనోహర్‌రావు, గంటా నాగేశ్వరరావు, నాగాబత్తుల రామారావు, రాచప్రోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

కొయ్యలగూడెం: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో బుధవారం మంగపతిదేవిపేట గ్రామంలో ప్రచారజాత యాత్ర నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ సంపదను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి, దేశ ప్రజలపై భారాలను మోపుతోందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్య మానవుడు బతకాలంటే కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గ్రామ కమిటీ అధ్యక్షులు గుదే శ్రీనివాసరావు, బి.మల్లేశ్వరరావు, జక్కు కొవ్వాడియ్య, తేలే రాంబాబు, ఇళ్ల కొవ్వాడియ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు కృషి


గర్భిణికి సీమంతం చేస్తున్న సాయిబాలపద్మ

బుట్టాయగూడెం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పౌష్టికాహారం అందించి బాలింతలు, గర్భవతులు, పిల్లలు ఆరోగ్యానికి భరోసా కల్పించే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ కోఆర్డినేటర్ వందనపు సాయిబాల పద్మ అన్నారు. బుట్టాయగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రం-1 సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల పనితీరుపై సూపర్‌వైజర్ ఝాన్సీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాయిబాల పద్మ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతంలో రక్తహీనత నివారణకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నూర్జహాన్, వసుంధర, సుధ, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి చేయాలి


కామవరపుకోటలో గౌతు లచ్చన్నకు నివాళి అర్పిస్తున్న బీసీ సంఘ సభ్యులు

కామవరపుకోట : సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి చేయాలని నియోజకవర్గ గౌడ్ సంఘ కన్వీనర్ పరసా మోహన్ అన్నారు. బుధవారం స్థానిక గౌడ సంఘ కమ్యూనిటీ హాల్ నందు కామవరపుకోట శ్రీ రామభద్ర గౌడ యువత ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ వెనకబడిన కులాల వారి హక్కుల కోసం పోరాడిన మహనీయుడు లచ్చన్న అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు బీసీ కులాలంతా ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు శ్రీ రామభద్ర గౌడ్ సంఘం అధ్యక్షుడు పలివెల ప్రభాకర్, ఉపాధ్యక్షులు పరసా శ్రీనివాసరావు, వీరమల్ల మధు, గుల్లా రామకృష్ణ, గుల్లా రవికుమార్, గుల్లా రమేష్, మట్ట పవన్, శిలబోయిన విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని స్థానిక కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం నిర్వహించారు. బీసీ చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలగల దుర్గారావు గౌతు లచ్చన్న సేవలను కొనియాడారు. లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జమ్మి శ్రీనివాస్ తాడిగడప ఆంజనేయరాజు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి, రైతునాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతి కార్యక్రమం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి బీసీ నాయకులు నివాళులు అర్పించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ


విజయదుర్గమ్మ ఆలయంలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో మాస శివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివపార్వతులకు పల్లకీ సేవలో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే అమ్మవారి ఆలయంలో లలితా సహస్ర నామ పారాయణ కార్యక్రమం 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో దీపాలంకరణ చేశారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, కార్యదర్శి మాడా రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

చింతలపూడి : పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయుడు తీవ్రంగా కొట్టడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నామవరం గ్రామానికి చెందిన ఆకుల అనీష్ ఏడవ తరగతి చదువుతున్నాడు. బుధవారం విద్యార్థి ప్రోగ్రెస్ రిపోర్టు ఇచ్చే విషయంలో ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడిని గాయపరిచినట్లు తెలిసింది. గాయపడ్డ ఉపాధ్యాయుణ్ణి ఏలూరు ఆంధ్ర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం


మౌనికను ఓదారుస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం తాటిరామన్నగూడెం అగ్నిప్రమాద బాధితులను బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. అగ్నిప్రమాదంలో హనీ అనే 11 నెలల చిన్నారిని కోల్పోయి బాధపడుతున్న తల్లిదండ్రులు విజయ్‌కుమార్, మౌనికలను ఓదార్చి ధైర్యం చెప్పారు. అలాగే సర్పంచ్ సున్నం వరలక్ష్మి, ఎంపీపీ కోర్సా పోచమ్మ, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాసరెడ్డి, నాయకులు చందా ప్రసాద్, వనమా రామకృష్ణల చేతుల మీదుగా రూ.10 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరంకి వెంకటేశ్వరరావు, చిట్టిబొమ్మ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై ఎం.సాగర్‌బాబు

జంగారెడ్డిగూడెం : ప్రయాణికులకు వేసవి దాహార్తిని తీర్చేందుకు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్సై ఎం.సాగర్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రిడీమ్ ఇండియా మినిస్ట్రీస్ సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. శ్రీనివాసపురం రోడ్ జంక్షన్‌లో పిప్పర సొదామణి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పిప్పర శ్రీను, కుటుంబ సభ్యులు తెలిపారు. బాటసారులకు, ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారిశెట్టి రాజేష్, సింహ, సిద్దు, సత్యనారాయణ, సాయి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పరిహారం విలువలపై అభ్యంతరాల స్వీకరణ


నిర్వాసితుల నుంచి ఇంటి రశీదులను పరిశీలిస్తున్న అధికారులు

కుకునూరు : పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలోని కుకునూరు ఎ-బ్లాక్‌కు సంబంధించి ఒకే అసెస్‌మెంట్ నెంబర్ మీద ఒకరి కంటే ఎక్కువ లబ్ధిదారుల పేర్లు రావడంతో బుధవారం అధికారులు సంబంధిత నిర్వాసితుల నుంచి రశీదులు పరిశీలించి ఎవరికి అవార్డు పాస్ చేయాలన్న విషయంపై వివరాలు సేకరించారు. గత సర్వేలో ఒకే ఇంటి నెంబరుపై ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారుల పేర్లు ప్రచురితమైన నేపథ్యంలో ఎవరికి అవార్డు పాస్ చేయాలన్న విషయంపై ధృవీకరించుకునేందుకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసుల ప్రకారం నిర్వాసితులు బుధవారం సమావేశానికి హాజరై తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు చూపించి పరిష్కరించుకున్నారు.